క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మంజునాథ గార్డెన్‌లో శుక్రవారం జిల్లా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రమాభాయ్ అంబేద్కర్ విశిష్ట మహిళా పురస్కార్ 2023 అవార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం సతీమణి, సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు లక్ష్మి శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నల్లాల భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

రక్తదానం చేసి.. మృతికి సంతాపం తెలిపి



రక్తదానం చేస్తున్న నాయకులు

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడికందుల అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన మృతిపై స్థానికులు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంతాపం తెలిపారు. ఇందుకు గాను శుక్రవారం గ్రామంలో ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన స్థానికులతో పాటు, యూత్ కాంగ్రెస్ నాయకులు 54మంది రక్తదానం చేశారు. దాతలు ఇచ్చిన రక్తదానాన్ని మంచిర్యాల జననీ బ్లడ్ బ్యాంక్ వారు సేకరించారు. కార్యక్రమంలో స్థానికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐదో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశంకోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం పొడిగించినట్లు బెల్లంపల్లిలోని కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్, సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వరూప వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2023–24విద్యాసంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు తుది గడువు ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోకుండా ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 23న ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని షాదీఖానాలో ఆదివారం ఉదయం 10–30గంటలకు జిల్లాలోని మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదమల్ల హరికృష్ణ, డాక్టర్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్‌కు మండల, క్లబ్‌ల సభ్యత్వం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మాస్టర్లు 9618720833 ఫోన్ నంబర్‌లో సంప్రదించి కానీ, నేరుగా సమావేశానికి హాజరై సభ్యత్వం పొందవచ్చని తెలిపారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

జన్నారం: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలం కేంద్రంలో ఓ రెస్టారెంట్‌ను శుక్రవారం ప్రారంభించిన ఆమె, అనంతరం పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. కార్యకర్తలు స్వశక్తితో ఎదగాలని, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేష్‌యాదవ్, ఎంపీటీసీ రియాజొద్దీన్, నాయకులు ఆనందం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: బాలికలకు రుచికరమైన భోజనం వడ్డించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశించారు. బెల్లంపల్లిలోని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ భోజనశాల గదికి వెళ్లి విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఆ తర్వాత తరగతి గదిలోకి వెళ్లి బాలికలతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పలువురు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

బెల్లంపల్లిరూరల్: బీఆర్ఎస్ పాలనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో శుక్రవారం రూ.21లక్షల నిధులతో నిర్మించే నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామాల్లో మట్టి రోడ్లతో ప్రజల ఇబ్బందులు పడుతున్నందునా ప్రభుత్వం సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వాటిని అమలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ స్వరూప, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం'

బెల్లంపల్లి: మండు వేసవిలో ఎండి పోతున్న ప్రజల గొంతును తడపడం అభినందనీయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో శుక్రవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పుర ప్రజలకు తాగునీరు అందించి ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడేపు సతీష్‌కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, జనహిత సేవా సమితి నిర్వాహకులు కాంపల్లి విజయ్‌కుమార్, గిరిప్రసాద్, సంతోష్, సాంబారి నర్సయ్య, పూదరి నగేష్‌గౌడ్, మల్లేష్, సురేందర్, ప్రసాద్, బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పురోగతిపై సమీక్ష



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

నెన్నెల: గ్రామాల్లో వందశాతం కంటి పరీక్షలు నిర్వహించాలని, అందరికీ సేవలందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు కంటి వెలుగు సిబ్బందికి సూచించారు. జోగాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. 18సంవత్సరాలు పై బడిన వారందరినీ స్క్రీనింగ్ చేసుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. రోగుల నమోదుతో పాటు పరీక్షల ఏర్పాట్లను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం గ్రీన్‌ఫ్రైడేలో భాగంగా హరితహారంలో నాటిన మొక్కలకు గన్‌పూర్‌లో నీళ్లు పట్టారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి పలు ప్రభుత్వ పథకాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ రమాదేవి, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో వరలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ నరేష్, ఆర్ఐ గణేష్ ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్

కాసిపేట: సోమగూడం భరత్‌కాలనీలో శుక్రవారం పోచమ్మ సల్లమల్లన్న విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. జాతీయ రహదారి ఫోర్‌లైన్ విస్తరణలో భాగంగా రెండు ఆలయాలు రోడ్డు వెడల్పులో కూల్చివేయగా, నూతనంగా ఆలయాలను నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రమీలగౌడ్, నాయకులు సిద్ధయ్య, మహేష్, రాంచందర్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

బెల్లంపల్లి: ఏళ్ల తరబడి నుంచి విధులు నిర్వర్తిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బెల్లంపల్లి మండల వీఓఏలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డెప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఆర్‌డీఏ, సెర్ప్ విభాగాల్లో గడిచిన 20ఏళ్ల నుంచి పని చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తమకు కేవలం రూ.3,900 మాత్రమే చెల్లిస్తోందని, ఆ వేతనం దేనికి సరిపోవడం లేదని, కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నామని, ప్రజల ఆర్థిక స్థితి గతులను మెరుగు పర్చడానికి కృషి చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వీఓఏలకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, రూ.10లక్షల విలువైన ఆరోగ్య భీమా కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెం.58ని సవరించాలని, వేతనాన్ని వీఓఏ వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వీఓఏలు పి.పోశం, వెంకటస్వామి, మల్లేష్, సృజన, భాగ్య, గాయత్రి, శ్రీవేణి, జీ.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, శివకుమార్ కృష్ణ, రమేష్, రేణుక పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

మందమర్రిరూరల్: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్యులు రమేష్, శివప్రతాప్ పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఇటీవల గుండెపోటుతో వయసుతో నిమిత్తం లేకుండా, చాలా మంది చనిపోవడం బాధ కలిగించిందన్నారు. గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేస్తే ప్రాణాపాయం తప్పుతుందని వివరించారు. కార్యక్రమంలో ఉపకేంద్రాల ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్దు గ్రామంలో శుక్రవారం ఓ గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామంలోని సూదుల సత్తయ్యకు చెందిన ముర్రా గేదె ఉదయం మేత కోసం బయటకు వెళ్లింది. గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తున్న క్రమంలో, ప్రమాదవశాత్తు ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సత్తయ్య వేడుకుంటున్నాడు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాండూర్: రబీ సీజన్‌లో పంటలను నాశనం చేస్తున్న చీడపీడల నుంచి కాపాడుకునేందుకు తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ అన్నారు. మండలంలోని కిష్టంపేట, రేచినీ, కొత్తపల్లి రైతు వేదికల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సరైన సూచనలు, సలహాలు పాటించి పంటలను సంరక్షించుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ ఆహార భద్రత పథకం క్రింద పలువురు రైతులకు మినుము విత్తనాల మినీ కిట్లను అందజేశారు. రైతులు పప్పు దినుసు పంటలను పండించాలని సూచించారు.

సాదాసీదాగా మండల సమావేశం



ఏవోను నిలదీస్తున్న సర్పంచ్ బాపు

వేమనపల్లి: ఫర్టిలైజర్ షాపు యజమానులు అధిక ధరలకు ఎరువులు అమ్ముతూ రైతుల నడ్డి విరుస్తున్నారని సభ్యులు ఇన్‌చార్జి ఏఓ విజయ్‌కుమార్‌ను మండల సర్వసభ్య సమావేశంలో నిలదీశారు. ఎంపీపీ కోలి స్వర్ణలత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన లేకుండా హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు రాకపోవడంతో ఖాళీ కుర్చీలతో సభ వెలవెలబోయింది. ఎంపీటీసీ దాగం బాపు, సర్పంచ్ కొండగొర్ల బాపులు ఏఓ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్న వారికే రైతుసేవ, ఆకా సెంటర్లు కేటాయిస్తున్నారన్నారు. దీంతో సబ్సిడీ ధరకు అమ్మాల్సిన ఎరువులను వారే ప్రైవేట్ డీలర్లుగా మారి అడ్డగోలు ధరలకు ఎరువులు అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.350 యూరియా, రూ.1450 నుంచి రూ.1500 కాంప్లెక్స్ ఎరువులు అమ్ముతుండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. నెలనెలా మామూళ్లకు అలవాటు పడిన అధికారులు రైతు సేవా కేంద్రంలో ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. అదే విధంగా ముల్కలపేటలో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని సభ్యులు తెలిపారు. సమావేశానికి హాజరుకాని ప్రాధాన్యత కలిగిన అధికారులపై చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదిక తయారు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోలి స్వర్ణలత మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ గణపతి, ఎంపీటీసీలు చంద్రకళ, కో ఆప్షన్ సభ్యుడు జాహెద్‌అలీ, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంఈవో తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఏవీఎన్‌రెడ్డి గెలుపుతో తపస్ సంబురాలు



డీఈవో కార్యాలయం ఆవరణలో సంబురాలు

మంచిర్యాలఅర్బన్/భీమిని/చెన్నూర్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) బలపరిచిన హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించటంతో శుక్రవారం మంచిర్యాల, చెన్నూర్, కన్నెపల్లిలో తపస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. డీఈవో కార్యాలయం ఆవరణలో మిఠాయిలు పంచి, టపాసులు కాల్చారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో తపస్ రాష్ట్ర అధనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్,తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలేష్‌కుమార్, తుల మధుకర్, నాగేందర్, ఆర్థిక కార్యదర్శి చీర సమ్మయ్య పాల్గొనగా, చెన్నూర్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయంపు శ్రీనివాసరావు, కొట్టె నాగరాజు, సింగిరెడ్డి సాంబయ్య, అడిచర్ల రాజ్‌కుమార్, కన్నెపల్లిలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆయుధాల నగేందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీలు సక్రమంగా చేయాలి

- జీఎం సంజీవరెడ్డి
- కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందజేత



నియామకపత్రాలు పొందిన అభ్యర్థులు

శ్రీరాంపూర్: కారుణ్య ఉద్యోగం క్రింద ఉద్యోగాల్లో చేరిన డిపెండెంట్లు సక్రమంగా డ్యూటీలు చేయాలని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద శుక్రవారం 47మందికి జీఎం చేతుల మీదుగా కారుణ్య ఉద్యోగాల నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో మీ తండ్రులు, మామల త్యాగాల వల్ల ఉద్యోగాల్లో చేరారని వారిని వృద్ధాప్యంలో వారి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. గైర్హాజరు లేకుండా పని చేయాలన్నారు. విధి నిర్వాహణలో ఉన్నతాధికారుల ఆదేశాలు, సీనియర్ ఉద్యోగుల సలహాలు పాటించాలన్నారు. రక్షణతో పని చేసి బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. కంపెనీ అప్పగించే ప్రతి పనిచేయాలన్నారు. ఫలానా డిజిగ్నేషన్‌కు వెళ్లను అనరాదన్నారు. క్రమ శిక్షణతో పని చేసే వారికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. కంపెనీ వ్యాప్తంగా ఇప్పటికి 10872మందికి, శ్రీరాంపూర్‌లో 3183మందికి కారుణ్య ఉద్యోగాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూజీఎం త్యాగరాజు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, పీఎం కాంతారావు, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ పీవీ రావు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

- డీఎంఎస్ డాక్టర్ జాన్‌జార్జీ



మాట్లాడుతున్న డాక్టర్ జాన్‌జార్జీ

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగుల ఆరోగ్యాలను పరిరక్షించాలని, దీని కోసం కంపెనీ సరైన చర్యలు తీసుకోవాలని డీఎంఎస్(మెడికల్) డాక్టర్ జాన్ జార్జీ తెలిపారు. ఆర్కే 8 డిస్పెన్సరీ వద్ద దీర్ఘకాలిక జబ్బులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులకు కంపెనీ మెరుగైన వైద్య చికిత్స అందిస్తుందన్నారు. కంపెనీ వ్యాప్తంగా ఉన్న పీఎంఈ వైద్యులంతా కూడా అసోసియేటెడ్ ఫెలో ఇండస్ట్రీయల్ హెల్త్ సర్టిఫైడ్ వైద్యులని, వీరందరూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎల్లవేళలా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. నేటి వారవరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఉద్యోగి మంచి ఆహార నియమాలు పాటించాలన్నారు. అనంతరం ఏరియా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కంపెనీ ఆసుపత్రుల్లో అన్ని రకాల సదుపాయాలు, అనుభవం ఉన్న వైద్యులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో డీవైసీఎంఓ రమేశ్‌బాబు, ఇన్‌చార్జి సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, వైద్యులు మురళీధర్, వేద వ్యాస్, స్వప్న పాల్గొన్నారు.

ఐకే1ఏ రక్షణ వారోత్సవాలు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై శుక్రవారం రక్షణ వారోత్సవాల సందర్భంగా రక్షణ ప్రతిజ్ఞ చేశారు. గని మేనేజర్ బ్రహ్మాజీ, సివిల్ డీవైఎస్ఈ రాము మాట్లాడుతూ పని ప్రాంతాల్లో తప్పకుండా రక్షణ పరికరాలను వినియోగించాలన్నారు. భద్రత కోసం ఏర్పాటు చేసిన రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు మహేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై అవగాహన

రామకృష్ణాపూర్: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్కే ఓసీ గనిలో శుక్రవారం కిడ్నీ సమస్యలపై హెల్త్ ఆఫీసర్ లోకనాథ్‌రెడ్డి కార్మికులకు అవగాహన కల్పించారు. కిడ్నీ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు, కిడ్నీ సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో ఓసీ మేనేజర్ వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శులు రాజ్‌కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సీఎంపీఎఫ్ చీటీలు పంపిణీ

శ్రీరాంపూర్: ఏరియాలో ఉద్యోగులకు 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఎంపీఎఫ్ చీటీలను జీఎం కార్యాలయం వద్ద శుక్రవారం జీఎం బీ సంజీవరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గనులు, డిపార్టుమెంట్‌లలో రెండు రోజుల్లో వీటిని పంపిణీ చేస్తామన్నా రు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూజీఎం త్యాగరాజు, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏరియా ఇంజనీర్ రమేశ్‌బాబు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, సీనియర్ పీఓ కాంతారావు, ఐటీ అధికారి శ్రీనివాస్, జీఎం కార్యాలయం పిట్ సెక్రెటరీ పీవీ రావు పాల్గొన్నారు.

రక్షణసూత్రాలు పాటిస్తే ప్రమాదాలు జరగవు

తాండూర్: రక్షణ సూత్రాలు తూ.చ తప్పక పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటూ జీఎం కెహెచ్ఎన్ గుప్తా అన్నారు. బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్ ఆవరణలో శుక్రవారం ఉద్యోగులకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింగరేణిని ప్రమాదాలు లేని సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. రక్షణ పరికరాలు విధిగా ధరించాలని కోరారు. ఎస్ఎంటీసీ ఎస్ఓఎం జీవీఎస్ విజయ్‌కుమార్, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సన్మానం

జైపూర్: సింగరేణి సంస్థలో 35ఏళ్లుగా పని చేసి జీఎం పర్సనల్‌గా పదవీ విరమణ పొందిన ఆనందరావును ఎస్టీపీపీ అధికారులు సన్మానించారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు అడ్మిన్ భవన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఆనందరావును శాలువాలతో సన్మానించి సత్కరించారు. సింగరేణి సంస్థకు ఆనందరావు విశేషమైన సేవలు అందించారని ఎస్టీపీపీ జీఎం డీవీఎస్ఎస్ సూర్యనారాయణ రాజు తెలిపారు. కార్యక్రమంలో వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం పీసీఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఏజీఎం సత్యనారాయణ ప్రసాద్, శ్రీనివాసులు, డీజీఎం పర్సనల్ కేసా నారాయణ, సీఎంవోఏఐ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు సముద్రాల శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఏఓకు ఫిర్యాదు

వేమనపల్లి: గొర్లపల్లికి చెందిన వినాయకషాపులో అధిక ధరలకు ఎరువులు అమ్ముతూ అమాయక రైతులను మోసం చేస్తున్నారని విష్ణువర్ధన్‌గౌడ్ అనే రైతు ఇన్‌చార్జి ఏఓ విజయ్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రూ.330 నుంచి రూ.350వరకు యూరియా, రూ.1400 నుంచి రూ.1500వరకు కాంప్లెక్స్ ఎరువులను ఎమ్మార్పీ ధర లేకుండా విక్రయిస్తున్నారన్నారు. రైతులకు ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా తెల్లకాగితంపై లెక్కలు రాసి, రైతులకు బిల్లులు ఇస్తున్నారని తెలిపారు. నకిలీ మందులు రైతులకు అంటగడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫర్టిలైజర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రం అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రంజిత్, మధ్యాహ్న భోజన కార్మికులు కాంతమ్మ, సునీత, లక్ష్మీ, దేవమ్మ, పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభ ప్రచార పోస్టర్లను శుక్రవారం హాజీపూర్ మండలంలోని రాపల్లి స్టేజీ వద్ద ఆవిష్కరించారు.

విజయవంతం చేయాలి

తాండూర్: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ)రాష్ట్ర 9వ మహాసభలను ఈ నెల 25–27 తేదీల్లో మంచిర్యాలలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం శ్రేణులు శుక్రవారం తెలిపారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మిక వర్గ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

లక్సెట్టిపేట: మండలంలోని ఐకేపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం స్థానిక తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు.

గిరిజన వికాసం బోరు పనులకు శంకుస్థాపన

భీమారం: మండలంలో సీఎం గిరిజన వికాసం కింద మంజూరైన బోరు బావులకు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. భూములు కలిగిన నిరుపేద గిరిజనులకు వ్యవసాయ రంగానికి ఉపయోగపడేలా బోరుబావులు నిర్మించి, అనంతరం వాటిని అభివృద్ధి పర్చనున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీవో సతీశ్‌రెడ్డి, ఈజీఎస్ టీసీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

కాసిపేట: మండలంలోని కోమటిచేను,బుగ్గగూడ, పల్లంగూడ నర్సరీలను శుక్రవారం ఎంపీడీఓ ఎం.ఏ.ఆలీం పరిశీలించారు. మొక్కలకు నీళ్లు పోస్తూ కాపాడాలన్నారు. అనంతరం ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఎంజీఎన్ఆర్ఈజీఎస్, హరితహారం, శానిటేషన్, టాక్స్ కలెక్షన్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈజీఎస్‌లో కూలీలను వందకు తక్కువ కాకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. 20వ తేదీలోపు పన్నుల వసూలు పూర్తి చేయాల్సిందిగా తెలిపారు.